క్లుప్తంగా

వనమాను కలిసిన జెడ్పీ చైర్మన్



వనమాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్‌గా నియామకమైన కంచర్ల చంద్రశేఖర్ రావు శనివారం పాత పాల్వంచలోని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వనమాకు పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా జెడ్పీ చైర్మన్ నియామకం, రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై ఇరువు చర్చించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: గీతా జయంతి సందర్భంగా వివేకానంద విద్యాలయం వేదికగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎస్ఎస్‌వీ ఎన్.సాయి మణికంఠ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించాడు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మణికంఠను అభినందించారు.

శ్రీ రాగా ప్లే స్కూల్ చిన్నారులు..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలను శనివారం వివేకనంద పాఠశాలలో



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి దాదాపు వంద మంది పాల్గొన్నారు. ఈ పోటీలలో శ్రీ రాగా ప్లే స్కూల్ చిన్నారులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలిచారు. విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్, డైరెక్టర్ కవిత అభినందించారు.

పీహెచ్‌సీలో నిరుపయోగంగా హ్యాండ్ వాష్

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరోనా కాలంలో యూనిసెఫ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. ఆస్పత్రికి వచ్చే ప్రతీఒక్కరూ చేతులు శుభ్రంగా చేసుకుని లోపలికి ప్రవేశించేలా ఈ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది నిరుపయోగంగా ఉండటం గమనార్హం. ఆస్పత్రి ఎదుట వివిధ పైపుల లీకేజీల వల్ల బురద, అపరిశుభ్రత ఏర్పడింది. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. హ్యాండ్‌వాష్‌ను పునరుద్ధరించాలని, అపరిశుభ్రతను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



చుంచుపల్లి: ఆర్టీసీ బస్సులో మహిళలు



ఇల్లెందు: బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



ఇల్లెందే బస్టాండ్‌లో ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మాధురి

మహాలక్ష్మి పథకం ప్రారంభం

- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

చుంచుపల్లి/ఇల్లెందు: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ఆ పార్టీ అధినేత సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా శనివారం మహాలక్ష్మి, చేయూత పథకాలకు శ్రీకారం చుట్టింది. ఈ రెండు పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అదే సమయంలో జిల్లాలోనూ కలెక్టర్ ప్రియాంక చేతుల మీదుగా ఈ రెండు పథకాలను ప్రారంభించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం మహాలక్ష్మి పథకాన్ని కలెక్టర్ ప్రారంభించి మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. అనంతరం కొత్తగూడెం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అలాగే ఇల్లెందు డిపోలో మేనేజర్ సంజీవరాణి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యురాలు మాధురి ఉచిత బస్ సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. మొదటిరోజు మధ్యాహ్నం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు మహిళలు అధిక సంఖ్యలో ఆసక్తి చూపారు. ఆర్టీసీ అధికారులు రెండు గంటల తర్వాత ఉచిత టికెట్ సౌకర్యాన్ని పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అందుబాటులోకి తెచ్చారు. తొలిరోజు వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన మహిళలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో ప్రయోజనకరమని సంతోషం వ్యక్తం చేశారు. ఇల్లెందులో డిపో మేనేజర్ సంజీవరాణి, ఏఓ రవీందర్, విజిలెన్స్ ఆఫీసర్ సుభా, కాంగ్రెస్ పట్టణ మండల అధ్యక్షుడు డానియేల్, పులి సైదులు, తాటి భిక్షం, శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, కాంగ్రెస్ మహిళా పట్టణ అధ్యక్షురాలు స్వరూప, ఆరెం కిరణ్, అనిల్, సర్పంచ్ తాటి చుక్కమ్మ, కల్తి పద్మ, పాయం లత, పాయం స్వాతి, మోకాళ్ల వెంకటమ్మ, గూడ బాబూరావు, బుచ్చయ్య, ధనియాకుల బాబు ఉన్నారు.

ఈ పథకం బాగుంది..



ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్ సర్వీసులు ప్రవేశపెట్టడం ఆనందంగా ఉంది. ఈ పథకం ప్రవేశపెట్టిన రోజే బస్ ఎక్కటం మరెంతో ఆనందంగా ఉంది. ఖమ్మం నుంచి ఇల్లెందు రూ.70 చార్జీ ఉండేది. ఆస్పత్రికి వెళ్లి వస్తున్నాను. ఈ డబ్బులు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి.

– వసంత, గృహిణి, ఇల్లెందు

ఈ సౌకర్యం వస్తుందనుకోలేదు..



ఏటా బస్ చార్జీలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ఈ తరుణంలో చార్జీలు లేని ప్రయాణం చేసే రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. మహిళలకు ఉచితంగా బస్సులలో ప్రయాణం ఎంతో ఆనందంగా ఉంది. పండుగలు పబ్బాలకు వెళ్లే వారికి బస్ చార్జీలు లేకుండా ప్రయాణం ఎంతో మేలు చేస్తుంది.

–స్వర్ణ, ఇల్లెందు, గృహిణి

మహిళలకు వరం..



ఆడపడుచుల కోసం ఆర్టీసీలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం శుభ పరిణామం. మహిళలంటే మహాలక్ష్మి పేరు గుర్తుకు వస్తుంది. అలాంటి మహాలక్ష్ములు ఆర్టీసీలో ప్రయాణించటం సౌభాగ్యకరం. ఆర్టీసీలో సాక్షాత్తు మహిళలు ప్రయాణించడంతో రాబోయే రోజుల్లో సంస్థకు లక్ష్మీకళ చేకూరుతుందని ఆశిస్తున్నాను.

– ఎస్.భవాని ప్రసాద్ డిప్యూటీ ఆర్ఎం, కొత్తగూడెం

మాట నిలుపుకున్న సీఎం రేవంత్..



అధికారం చేపట్టిన మరుసటి రోజే మహిళలకు ఉచిత బస్ సర్వీసులు ప్రవేశపెట్టడం గొప్ప విషయం. ఇక మీద ప్రయాణం పేదలకు భారం కాదు. అందరికీ ఉపయోగపడేలా ప్రవేశపెట్టడం మరింత మందికి ఉపయోగంగా ఉంటుంది. ఈ పథకం ప్రారంభించిన రోజే ప్రయాణించడం ఆనందంగా ఉంది. ఇది మేం ఊహించలేదు.

– నంవిత, ఇల్లెందు, గృహిణి

మహిళలందరికీ ఉచితమే..



ఉచిత ప్రయాణంపై ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఆర్టీసీలో ప్రయాణించే మహిళలకు టికెట్ తీసుకోవద్దని చెప్పారు. ఎవరైనా ఆధారం చూపినా, చూపకపోయినా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని చెప్పారు. తొలిరోజు ఎక్కువ సంఖ్యలోనే మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు.

– సామ్రాజ్యం: కండక్టర్, కొత్తగూడెం

అన్ని ఏర్పాట్లు చేశాం..



ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమల్లోకి తెచ్చింది. కలెక్టర్ ప్రియాంక శనివారం కొత్తగూడెంలో ప్రారంభించారు. మహిళలందరికీ ఫ్రీ టికెట్‌ను జారీ చేస్తున్నాం. తొలిరోజు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– బి.వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్ కొత్తగూడెం

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

పాల్వంచ: కేటీపీఎస్ కాలనీలోని రుక్మిణి రాధాకృష్ణ దేవాలయంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బీవీఆర్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకు అశోక్, హరి రమేశ్, అయోధ్య, రాంబాబు, రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, వీరనారాయణ, నరసింహారావు, లక్ష్మణ్, రామాచారి, మురళీ, అశోక్, కేటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు వనసమారాధన

జూలూరుపాడు: ఆదివారం పెనుబల్లి మండలం శ్రీనీలాద్రీశ్వరాలయ ప్రాంగణంలో జూలూరుపాడు మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణుల కార్తీక వన సమారాధన జరగనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వనసమారాధన మహోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణులందరూ కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో...

కాకర్ల శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలోని మామిడి తోటలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన మహోత్సవం జరగనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు ఉడతా వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్యులందూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సోనియా గాంధీ త్యాగం మరువలేనిది

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో.. ఏఐసీసీ అగ్రనేత శ్రీమతి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లిగా సోనియాగాంధీ పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఆమె త్యాగం మరువలేనిదన్నారు. ఎన్నికల హామీ ఆరు గ్యారెంటీలలో రెండింటిని సోనియాగాంధీ జన్మదినం రోజున అమలు చేయడం ఆనందంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిన గత పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తారన్నారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న నాగభూషణం



కొత్తగూడెంరూరల్: పొంగులేటి కార్యాలయంలో..



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు



ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియాలో...



సుజాతనగర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



జూలూరుపాడులో.. కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఉచిత ప్రయాణం చారిత్రాత్మక నిర్ణయం



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరచడం చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ అన్నారు. శనివారం జూలూరుపాడులో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళల అభిప్రాయాలను కాంగ్రెస్ నాయకులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో బానోత్ నవీన్ రాథోడ్, వాంకుడోత్ కిషన్ నాయక్, గుగులోత్ శ్రీను, బాదావత్ సామ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం..



పాల్వంచ: బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం మహిళలకు వరం అని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం పట్ల కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ఈ పథకం అమల్లోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ హయాంలో మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమల్లోకి వస్తాయన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళలకు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, పిట్టల రామారావు, బాదర్ల జోషి, కార్తీక్, రాము, సతీశ్, ఉపేందర్ నాయక్, రమేశ్, శాంతి వర్ధన్, స్వాతిరెడ్డి, పులి సత్యనారాయణ, చిరంజీవి, రాము, రాంబాబు, కొండల రావు, కోటి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టన అధ్యక్షుడు నూకల రంగారావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందు: మిచాంగ్ తుపాను వల్ల మండలంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్ వద్ద ఆందోళన నిర్వహించి తహసీల్దార్ కె.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మధు మాట్లాడుతూ... తుపాను వల్ల పంటలు నీటి పాలయ్యాయని తెలిపారు. అప్పు తెచ్చి పెట్టుబడి పెడితే చేతికొచ్చిన పంట తుపాను ప్రభావంతో తుడిచిపెట్టుక పోయిందని రైతులు ఆగమయ్యారని వాపోయారు. ఆయా పంటలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, యాకన్న, చింత ఉదయ్, సూర్నపాక నాగేశ్వరరావు, పాడుగు నాగేశ్వరరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వర్క్‌షాపులను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): విజయవాడలోని సింగరేణికి చెందిన అప్మేల్‌ను సింగరేణికి తరలించాలని, సింగరేణి వర్క్‌షాపులను బలోపేతం చేయాలని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపులో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా బొగ్గు గనులకు అనుసంధానంగా ఉన్న ఉత్పత్తి, మెయింటెనెన్స్ చేస్తున్న వర్క్‌షాపులు నానాటికీ బలహీన పడుతున్నాయన్నారు. సరైన పనులు లేక యంత్రాలన్నీ నిరుపయోగంగా ఉంటున్నాయన్నారు. అందువల్ల తెలంగాణలోని సింగరేణి ప్రాంత యువకులకు నైపుణ్యం గల కార్మికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయని చెప్పారు. వందల సంఖ్యలో కార్మికులతో కళకళలాడే సింగరేణి వర్క్‌షాపులు రోజురోజుకు నిర్వీర్యమవుతున్నాయని వాపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు ముఖ్యంగా వర్క్‌షాపు కార్మికులు ప్రధాన పాత్ర పోషించారు కానీ, స్వరాష్ట్ర పాలనలో వర్క్‌షాపులను ధ్వంసం చేయడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కళ్లు తెరిచి వర్క్‌షాపులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.కోట్ల యంత్ర పరికరాలను, సేఫ్టీ పరికరాలను కొత్తగూడెం సెంట్రల్ వర్క్ షాపు మెయిన్ వర్క్‌షాపులో తయారు చేయకుండా కొండపల్లిలో అప్మేల్‌కు ఆర్డర్ ఇచ్చి సంస్థపై ఆర్థిక భారం పెంచుతూ ఉద్యోగస్తులను తగ్గిస్తున్నారన్నారు. ఎన్నో అవకాశాలు తగినంత పెట్టుబడి, ముడి సరుకు మానవ వనరులు, పర్యవేక్షణ, సాంకేతిక ఉన్న సింగరేణిని కాదని అప్మేల్‌పైనే ఆర్డర్ ఇవ్వటంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. సింగరేణి వర్క్‌షాపులు బలోపేతం కావాలంటే కార్మిక హక్కులకై సంస్థ పరిరక్షణకై నిరంతరం పోరాడుతున్న బీఎంఎస్ కాగడా గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, జగన్మోహన్, ఊట్ల గణేష్, టి.నరేంద్రబాబు, సంగం చందర్, బి.రాంసింగ్, మోహన్, వీరయ్య, వీరకుమార్, అల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితరానికి యాకయ్య ఆదర్శం



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ఇల్లెందు: తనతో పాటు యావత్ కుటుంబాన్ని కూడా ఎర్ర జెండా నీడన సమున్నతంగా నిలిపి, నేటితరం నాయకులకు ఆదర్శంగా నిలిచిన మార్క్సిస్ట్ నేత దేవులపల్లి యాకయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కొనియాడారు. శనివారం ఇల్లెందులోని వినోభానగర్‌లో సీపీఎం డివిజన్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దేవులపల్లి యాకయ్య స్మారక స్తూపం వద్ద ఆయన ప్రథమ వర్ధంతి నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం ఉద్యోగాన్ని సైతం వదిలేసి పార్టీ అభివృద్ధికి కృషి చేశాడన్నారు. కమ్యునిస్ట్ ఎలా ఉండాలో యాకయ్య అన్ని అంశాల్లోనూ ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ అవసరాల కోసం ఎక్కడికి పంపినా వెళ్లి పని చేశాడని గుర్తు చేశారు. మున్సిపాల్టీలో మూడుసార్లు వార్డు కౌన్సిలర్‌గా పని చేశాడని తెలిపారు. కార్మిక, వ్యవసాయ రంగంలోనూ కూలీల సమస్యల పరిష్కారం కోసం పని చేశాడని గుర్తు చేశారు. పట్టణ, డివిజన్ కార్యదర్శిగా జిల్లా కమిటీ సభ్యుడుగా క్రమశిక్షణతో పని చేశాడని తెలిపారు. ఎంతోమంది నాయకులు సీపీఎంలో పని చేస్తుండగా వారి కుటుంబసభ్యులు ఇతర పార్టీలలో ఉన్నారని, యాకయ్య మాత్రం తన కుటుంబాన్ని పూర్తిగా పార్టీలో కొనసాగించారని తెలిపారు. మచ్చలేని లేని నేతగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఇల్లెందు ప్రాంత అభివృద్ధి కోసం పని చేసిన ఎంతో మంది సీపీఎం నేతలలో యాకయ్య ఒకరన్నారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల నేతలు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, దుగ్గి కృష్ణ, ఎస్ఏ నబీ, సోమలక్ష్మి, సంధ్య కిరణ్, కూకట్ల శంకర్, అబ్బాస్, జైరున్నిసా, మన్యం మోహన్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: కుటుంబ సమస్యలతో చోటు చేసుకున్న ఓ వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఈ సంఘటనలో ఇద్దరు సోదరులతో కలిసి భర్త మీద దాడి చేసి హతమారుస్తామని హెచ్చరించిన సంఘటనపై ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేశారు. రైటర్ బస్తీకి చెందిన షేక్ వజీర్‌ను ఆమె భార్య రెహానా, ఆమె సోదరులు ఖాజా, అజిత్‌లు కలిసి దాడి చేసి హతమారుస్తామని హెచ్చరించారని వజీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.